RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 04 సంచిక :155 బుధవారం 16-10-2024 పేజీలు :04 వెల:రూ.2.00

## దేశ రక్షణ విషయంలో కేంద్రం కట్టుబడి వుంది కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్

వికారాబాద్,విఎల్ఎఫ్ ప్రాజెక్ట్ మన దేశానికి అత్యంత ఉపయోగకరమైనది. నేడు అబ్దుల్ కలాం జయంతి ఈ రోజు శంకుస్థాపన పనులు ప్రారంభించదం హర్షణీయమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్కి కృతజ్ఞతలు. దేశం భద్రత రక్షణ విషయంలో రాజకీయాలు చేయడం లేదని అన్నారు. దేశం యొక్క బలమైన మరియు భద్రత కోసం ఈ రకమైన స్టేషన్లు మన దేశానికి అత్యంత ముఖ్యమైనవి. పూర్వం కమ్యూనికేషన్ మరియు సమాచారం కోసం ఈగల్ మరియు ఇతర పక్షులను ఉపయోగించాము. ఇతర కమ్యూనికేషన్లను వ్యవస్థను బలోపేతం చేస్తు ఉపయోగిస్తున్నాము. కమ్యూనికేషన్ వ్యవస్థను వేగంగా అభివృద్ధి చేస్తున్నాము. గత ముప్పై సంవత్సరాల నుండి మన దేశం కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. దేశం బలమైన మిలిటరీని నిర్మించడానికి కట్టుబడి ఉందని అన్నారు.కొందరు వ్యక్తులు ఈ ప్రాజెక్ట్ గురించి తప్పుడు సమాచారాన్ని సృష్టిస్తున్నారు. మరియు పర్యావరణానికి నష్టం జరిగిందని అంటున్నారు.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

# నేడు ఎపి కేబినేట్ భేటీ



అమరావతి,అక్టోబర్15: చంద్రబాబు ప్రభుత్వం కొలువు తీరిన అనంతరం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వరుసగా అమలు చేస్తూ వస్తుంది. ఆ క్రమంలో దీపావళి పండగ వేళ.. మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతుంది. అందుకోసం బుధవారం అంటే.. అక్టోబర్ 16వ తేదీ ఉదయం సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరగనుంది.

### పలు కీలక నిర్ణయాలపై చర్చ

ఈ సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలపై చర్చించి.. ఓ నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తుంది. వరదప్రభావిత ప్రాంతాల్లో రుణాల రీషెడ్యూల్లో స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపుపై నిర్ణయించే అవకాశముందని సమాచారం. అలాగే చెత్త పన్ను రద్దు ప్రతిపాదనపై చర్చించి ఓ నిర్ణయం తీసుకోనుంది. ఇక 13 కొత్త మున్సిపాలిటీల్లో 190 పోస్టుల భర్తీ ప్రతిపాదనపై ఈ కేబినెట్ భేటీలో చర్చించనుంది. రాష్ట్రంలోని వివిధ దేవాలయాలకు పాలక మండళ్ల నియామకంలో చట్ట సవరణ చేసేందుకు పలు ప్రతిపాదనకు రానున్నాయి. వాటిపై చర్చించి.. కేబినెట్ ఓ నిర్ణయం తీసుకోనుంది.దేవాలయాల పాలక మండలిలో 15 నుంచి 17 మందికి పెంచే ప్రతిపాదనపై చర్చించి ఓ కీలక నిర్ణయం తీసుకోనుంది. పాలక మండళ్లలో ఇద్దరు బ్రాహ్మణులను సభ్యులుగా నియమించే అంశంపై ఈ సందర్భంగా చర్చించనుంది. దేవాలయాల్లో చైర్మన్ సహా 17 మంది పాలక మండలి సభ్యుల నియామకానికి పచ్చ జెండా ఊపే అవకాశముందని తెలుస్తుంది. రాష్ట్రంలో స్వర్ణకారుల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు ఈ క్యాబినెట్లో ఆమోదముద్ర పడనుంది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభుత్వ జిఓలు ఉండే ఐనీతిస.జూ.ఐనీల.తిని వెబ్సైట్ను తిరిగి పునరుద్ధరించాలని నిర్ణయించింది. వైసీపీ హయాంలో అప్ లోడ్ చేయకుండా మాన్యువల్గా జారీ చేసిన జీవోలను సైతం జీవో ఐఆర్ సైట్లో అప్ లోడ్ చేయాలని ఈ కేబినెట్లో నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తుంది. వైసీపీ హయాంలో రహస్యంగా ఇచ్చిన జీవోలను పబ్లిక్ డొమైన్లో ఉంచేందుకు సైట్లో ప్రత్యేక బటన్ తీసుకు రావాలని చంద్రబాబు ప్రభుత్వం యోచిస్తుంది. గత ప్రభుత్వం జారీ చేసిన అక్రమ జీవోలు, అడ్డగోలు నిర్ణయాలను ప్రజల ముందు ఉంచాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇక యాంటీ నార్కోటిక్స్ టాస్క్ఫోర్స్ ద్వారా వచ్చే కేసులను త్వరిత గతిన పరిష్కరించేందుకు స్పెషల్, ఫాస్ట్ ట్రాక్ న్యాయస్థానాలు ఏర్పాటు చేసేందుకు ఈ కేబినెట్లో నిర్ణయం తీసుకోనుందని తెలుస్తుంది. అలాగే రాష్ట్రంలో మహిళలపై జరిగిన అఘాయిత్యాలకు సంబంధించి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుపై కేబినెట్లో చర్చించి ఆమోదించే అవకాశం ఉంది.

# ఎపిలో మద్యం పాలసీ ఖరారు

### నేటి నుంచే కొత్త పాలసీ అమలు
### డిజిటల్ పేమెంట్లకు అనుమతి



అమరావతి,అక్టోబర్15:ఏపీలో నూతన మద్యం పాలసీ తేదీ ఖరారైంది. ఈనెల 16 నుంచి అంటే గురువారం నుంచే రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ అమలులోకి రానుంది. ప్రతి మద్యం దుకాణంలోనూ డిజిటల్ పేమెంట్స్ జరిగేలా నిర్ణయం తీసుకుంది సర్కార్. గత ప్రభుత్వ హయాంలో డిజిటల్ పేమెంట్లకు గండిపడగా.. కూటమి ప్రభుత్వం మాత్రం డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకి తీసుకుని వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి డిజిటర్ పేమెంట్లు గణనీయంగా పెరిగాయి. జూన్ నుంచి ప్రతినెలా 9 శాతం పెరిగాయి. డిజిటల్ పేమెంట్ పద్ధతిని అవలంభించడం ద్వారా మద్యం అమ్మకాల్లో పారదర్శకత పెరిగింది. దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీ మొత్తంలో ఆదాయం లభించనుంది. రాష్ట్ర పరిపాలనకు ఆ నిధులు ఉపయోగపడనున్నాయి. ఇకపై రాష్ట్ర వ్యప్తంగా అన్ని లిక్కర్ షాపుల్లోనూ నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేయనుంది ప్రభుత్వం. అన్ని షాపుల్లోనూ ప్రీమియం బ్రాండ్స్ అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు మద్యం టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆన్లైన్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. ప్రతి మద్యం దుకాణంలోనూ ఆన్లైన్ పేమెంట్స్ అందుబాటులోకి వచ్చాయి. లాటరీ ప్రక్రియ విజయవంతం అయ్యింది. అలాగే టెండర్ల కోసం విదేశాల నుంచి దరఖాస్తులు పోటెత్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా 3396 మద్యం దుకాణాలకు గాను 89882 దరఖాస్తులు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్లో నూతన మద్యం పాలసీ అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఏపీలోని 3,396 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించగా.. రికార్డుస్థాయిలో 89,882 అప్లికేషన్లు వచ్చినట్లు ఆయన చెప్పారు. ఒక్కో షాపునకు సగటున 25 మంది దరఖాస్తు చేశారని మంత్రి కొల్లు వెల్లడించారు. దీని ద్వారా ఏపీ ప్రభుత్వానికి రూ.1,798 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. సోమవారం లాటరీ నిర్వహించి మద్యం షాపులు కేటాయింటినట్లు మంత్రి చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఈనెల 16 నుంచి నూతన మద్యం పాలసీ ద్వారా విక్రయాలు జరగనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణ, మద్యం షాపుల కేటాయింపు సజావుగా జరిగింది. ఇకపై ఏపీలో మద్యం విక్రయాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు మాత్రమే లిక్కర్ అమ్మకాలు జరుగుతాయి. ఈ మేరకు ఎక్సైజ్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. కొత్త బ్రాండ్స్ను టెండర్ కమిటీ ద్వారా ఫైనల్ చేసి తీసుకుంటాం. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. వైసీపీ హయాంలో ఇసుక, మద్యం విచ్చలవిడిగా అమ్మి జగన్ సొమ్ము చేసుకున్నారు. నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ నిబంధనలు పాటించకుండా ఇసుక తవ్వకాలు చేయడం వల్ల అనేక కేసులు నమోదు అయ్యాయి. అసలు జగన్ సర్కార్లో ఎంత ఇసుక తీశారో, ఎంత మేర విక్రయాలు జరిగాయో లెక్కలే లేవు. వైసీపీ చేసిన ఇలాంటి పనుల వల్ల ప్రజలపై భారం పడింది.

# ఆత్మనిర్భర్'లో భాగంగా.. డేటా సెంటర్లు

### దేశీయంగా డేటా భద్రంగానే ఉంటుంది
### టెలీకమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీని ప్రారంభించిన మోడీ






న్యూఢిల్లీ,అక్టోబర్15: నాలుగేళ్లకు ఒకసారి జరిగే వరల్డ్ టెలీకమ్యూనికేషన్ స్టాండరైజేషన్ అసెంబ్లీ-2024 ఈవెంట్ ఈ ఏడాది దిల్లీలో అట్టహాసంగా మొదలైంది. ఈ ఈవెంట్ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో కలిసి ఎగ్జిబిషన్లోని స్టాళ్లను పరిశీలించారు. దేశీయ ఆవిష్కరణలు ప్రదర్శించేందుకు నిర్వహించే ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ ఈవెంట్ 8వ ఎడిషన్ను కూడా ఈ కార్యక్రమంలోనే నిర్వహించారు. ఈ సందర్భంగా డేటా సెంటర్ల గురించి రిలయన్స్ జియో ఛైర్మన్ ఆకాశ్ అంబానీ ప్రస్తావించారు. 'ఆత్మనిర్భర్'లో భాగంగా.. డేటా సెంటర్లను భారత్లో నెలకొల్పే సామర్థ్యం ఉన్నందున అవి దేశంలోనే ఉండాలని ఆకాశ్ అన్నారు. డేటా సెంటర్ పాలసీ 2020 ముసాయిదాను నవీకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో భారత్లోని డేటా మొత్తం ఇక్కడి డేటా సెంటర్లోనే ఉంటుందన్నారు. భారత్ ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఆకాశ్ అంబానీ అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం.. ఇలా ప్రతి రంగంలోనూ ముందుకెళ్లేందుకు ఏఐ ఓ విప్లవాత్మక సాధనమని పేర్కొన్నారు. అందుకే ఏఐ, మెషిన్ లెర్నింగ్ డేటా సెంటర్లు ఏర్పాటుచేసేందుకు సిద్ధంగా ఉన్న కంపెనీలను ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. మొదటిసారి భారత్లో జరుగుతున్న డబ్ల్యూటీఎస్ఏ కార్యక్రమంలో పాల్గొనేందుకు 190 దేశాల నుంచి 3,000 మంది పారిశ్రామిక, సాంకేతికత నిపుణులు హాజరయ్యారు. 'ది ఫ్యూచర్ ఈ నౌ' థీమ్తో నిర్వహిస్తున్న ఈవెంట్లో 120కి పైగా దేశాల నుంచి 400కు పైగా ఎగ్జిబిషన్లు, 900కు పైగా స్టార్టప్లు ప్రదర్శించారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి సింధియా దేశీయ టెలికాం గురించి మాట్లాడారు. భారత్లో టెలికాం అనేది కేవలం వినోద మాధ్యమం కాదని బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కీలకమైన సమాచారం, గ్లోబల్ కమ్యూనిటీతో కనెక్ట్ అయ్యే సదుపాయాల కోసం వేగంగా విస్తరించిందన్నారు. 5జీ నెట్వర్క్ వేగంగా విస్తరిస్తోందన్నారు. స్పామ్ కాల్స్ పెరుగుతున్న తరుణంలో వీటి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రముఖ వ్యాపారవేత్త కుమార్ మంగళం బిర్లా పేర్కొన్నారు.

# మహారాష్ట్ర, జార్ఖండ్లో మోగిన ఎన్నికల నగారా

### మహారాష్ట్రలో నవంబర్ 20న ఒకే విడతలో పోలింగ్
### జారఖండ్లో రెండు విడతల్లో నవంబర్ 13,20న ఎన్నికలు
### రెండు రాష్ట్రాల్లోనూ నవంబర్ 23న ఓట్ల లెక్కింపు
### ఉత్తరప్రదేశ్లో 9 అసెంబ్లీ స్థానాలకు 13న ఉప ఎన్నిక
### కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడి



న్యూఢిల్లీ,అక్టోబర్15 : మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. మహారాష్ట్రలో నవంబర్ 20న ఒకే విడతలో పోలింగ్ జరుపనున్నట్టు సీఈసీ రాజీవ్ కుమార్ ప్రకటించారు. నవంబర్ 23న ఫలితాలు ప్రకటిస్తారు. గెజిట్ నోటిఫికేషన్ అక్టోబర్ 22న వెలువడుతుంది. నామినేషన్ల గడువు అక్టోబర్ 29వ తేదీతో ముగుస్తుంది. నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 30న జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు నవంబర్ 4వ తేదీతో ముగుస్తుంది. నవంబర్ 25వ తేదీలోగా ఎన్నికలు ముగియాల్సి ఉంటుంది. జార్ఖాడ్ అసెంబ్లీ ఎన్నికలు రెండు విడతలుగా జరుగనున్నట్టు సీఈసీ ప్రకటించారు. తొలి విడత నవంబర్ 13, రెండో విడత నవంబర్ 20న జరుగుతుంది. తొలి విడత ఎన్నికలకు అక్టోబర్ 18న నోటిఫికేషన్ వెలువడుతుంది. అక్టోబర్ 25తో నామినేషన్ల గడువు ముగుస్తుంది. అక్టోబర్ 28న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 30తో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. తొలి విడతలో భాగంగా 43 నియోజకవర్గాలకు నవంబర్ 13న పోలింగ్ జరుగుతుంది. రెండో విడత నోటిఫికేషన్ అక్టోబర్ 22న వెలువడుతుంది. అక్టోబర్ 29తో నామినేషన్ల గడువు ముగుస్తుంది. అక్టోబర్ 30న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు నవంబర్ 1వ తేదీతో ముగుస్తుంది. నవంబర్ 20న రెండో విడత పోలింగ్ జరుగుతుంది. నవంబర్ 23న కౌంటింగ్ జరిపి ఫలితాలు ప్రకటిస్తారు. కాగా, 288 మంది సభ్యులున్న మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబర్ 26తో ముగుస్తోంది. ఈలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. 81 స్థానాలున్న జార్ఖండ్ అసెంబ్లీ గడువు వచ్చే ఏడాది జనవరి 5వ తేదీతో ముగుస్తుంది. మహారాష్ట్రలో బిజీపీ, శివసేన, ఎన్సీపీతో కూడిన మహాకూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా, జార్ఖాండ్లో జెఎంఎం అధికారంలో ఉంది. అలాగే ఉత్తరప్రదేశ్లోని 9 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల తేదీని కూడా ఎన్నికల కమిషన్ మంగళవారంనాడు ప్రకటించింది. నవంబర్ 13న పోలింగ్ జరుగనుండగా, నవంబర్ 23న ఫలితాలు ప్రకటిస్తారు. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను కూడా ఇదే రోజు ప్రకటిస్తారు.

# అత్తాకోడళ్లపై సామూహిక అత్యాచారం కేసు.. హోంమంత్రి అనిత కీలక వ్యాఖ్యలు

మహిళల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో అత్తాకోడళ్లపై అత్యాచార ఘటన బాధాకరమని అన్నారు. ఈ కేసులో 48 గంటల్లోనే నిందితులను పట్టుకున్నామని తెలిపారు. టెక్నాలజీ ఉపయోగించి నిందితులను పట్టుకున్నామని పేర్కొన్నారు. పట్టుబడిన నిందితుల్లో ముగ్గురు మైనర్లు ఉన్నారని చెప్పారు. నిందితుల్లో ఒకరిపై 32 కేసులు ఉన్నాయని వెల్లడించారు. ఈ కేసును స్పెషల్ కోర్టుకు అప్పగిస్తామని తెలిపారు. నిందితులకు త్వరగా శిక్షపడేలా చేస్తామని హామీ ఇచ్చారు.ఏపీలో నేరాలు తగ్గిండచడమే తమ ప్రాధాన్యమని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. నేరాలు ఎక్కడ జరిగినా ముందే మేలుకోవాలని సూచించారు. ఒకవేళ నేరం జరిగినట్లయితే నిందితులకు కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. నేరాలు చేసినవాళ్లు తప్పించుకోకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. అన్ని ప్రార్థనాలయాల దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్కూళ్లు, కాలేజీల దగ్గర నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మహిళల భద్రత విషయంలో తమ ప్రభుత్వం చాలా జాగ్రత్తలు తీసుకుంటుందని తెలిపారు. ఇలాంటి కేసుల్లో జాప్యం లేకుండా స్పెషల్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళల భద్రత విషయంలో ఏ చిన్న ఘటన జరిగినా సరే ముఖ్యమంత్రే స్వయంగా మాట్లాడుతున్నారని తెలిపారు. ఘటనపై సీఎం వెంటనే ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటున్నారని అన్నారు.కాగా, మహిళలపై నేరాలు చేసేవారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఏపీ సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో నిందితులకు కచ్చితంగా, వేగంగా శిక్ష పడేలా దర్యాప్తు సాగాలని సూచించారు. శ్రీసత్యసాయి జిల్లాలో అత్తాకోడళ్లపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనపై సోమవారం డీజీపీ, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ ఘటనలో నిందితులకు తక్షణం శిక్షలు పడేలా చేయాల్సిన అవసరం ఉందన్న ముఖ్యమంత్రి ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి కేసును విచారించాలని ఆదేశించారు. దీని కోసం హైకోర్టుకు విన్నవించి ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేద్దామన్నారు. దీనితో పాటు గతంలో బాపట్ల జిల్లాలో మహిళపై సామూహిక అత్యాచారం, హత్య ఘటనపైనా ప్రత్యేక కోర్టు ద్వారా విచారణ జరిపించి నిందితులకు వెంటనే శిక్ష పడేలా చేయాలని సూచించారు. ప్రజల ప్రాణాలకు, మహిళల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ప్రతి వ్యక్తికి, ప్రతి మహిళ స్వేచ్ఛగా తిరిగేలా రాష్ట్రంలో శాంతి భద్రతలు కల్పించేందుకు అవసరమైన ప్రతి చర్య తీసుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు.




# బలపడిన అల్పపీడనం.. ఏపీలో జోరుగా వర్షాలు

అమరావతి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం మధ్యాహ్నం బలపడింది. కేంద్రీకృతమైన అల్పపీడనం 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ వాయుగుండం ఉత్తర తమిళనాడు, దక్షిణకోస్తా తీరం వైపు కదలుతూ రేపటికి తీవ్ర తుపానుగా మారి, చెన్నైకి దక్షిణంగా తీరం దాటవచ్చని అంచనా వేశారు.ఏపీలో ఇప్పటికే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడనం ప్రభావంతో నెల్లూరు ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. బయటికొచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. నెల్లూరు జిల్లాలో అత్యధికంగా జలదంకి మండలంలో 17.7 సెం.మీ, నిడవలూరులో 17.3, అల్లూరులో 15.4, కావలిలో 15.1, కొడవలూరులో 14 సెం.మీ వర్షపాతం నమోదైంది. బాపట్ల జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.భారీ వర్షానికి దుద్దుకూరు దగ్గర యార వాగు ఉధృతి ప్రవహిస్తోంది. దీంతో ఒంగోలు-ఇంకొల్లు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. విశాఖపట్నం, కడప, తిరుపతి, చిత్తూరు, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో ఎడతెరిపి లేని భారీ వర్షాలు పడుతున్నాయి. కుండపోత వర్షానికి పలు చోట్ల రోడ్లు జలమయం అయ్యాయి. కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి.భారీ వర్షాల హెచ్చరికతో చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. ప్రజలు, అధికారులు మూడ్రోజులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. తీరప్రాంతాల్లో గంటకు 55 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని.,మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

ప్రస్థానం తెలుగు దినపత్రిక మన దేశం..మన హక్కు



# సంపాదకీయం

బుధవారం 16-10-2024

## జమ్మూకు రాష్ట్ర హోదా సాధ్యమేనా...

పది సంవత్సరాల సుదీర్ఘ ఎదురు చూపుల తర్వాత జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికలు ఎట్టకేలకు ముగిశాయి. ప్రజలంతా పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొని, తమ నిర్ణయాన్ని వెల్లడించారు. గతంతో పోలిస్తే పెద్దగా మార్పుల్లేని ఫలితాల్లో జమ్మూ కాశ్మీర్‌లో కాంగ్రెస్ పొత్తుతో నేషనల్ కాన్ఫిరెన్స్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. ఇక, బీజేపీ కాస్త ఎక్కువ ఆశించినప్పటికీ అనుకున్నట్లే జమ్మూలో ఉనికి చాటుకుంది. అయితే, ఎన్నికలకు ముందు ఈ రెండు పార్టీలూ ఇచ్చిన హామీ ఒక్కటే? ఎన్నికల తర్వాత జమ్మూ కశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా ఇస్తామూ అని! మరి, ఈ హామీ నెరవేరుతుందా? జమ్ముకాశ్మీర్‌కు ఇప్పట్లో రాష్ట్ర హోదా సాధ్యమా? బీజేపీ రాజకీయాల్లో జమ్మూ కాశ్మీర్‌కు ఒక ప్రత్యేక స్థానం ఎప్పుడూ ఉంటుంది. పదేళ్లు భారతదేశాన్ని పాలించి, మూడో సారి కూడా కేంద్రంలో పవర్ సాధించిన బీజేపీ ప్రభుత్వం ఇప్పటికీ కాశ్మీర్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తుంది. ఇలా ఎందుకు అనే ప్రశ్నకు అనేక వాదనలు ఉన్నాయి. అయితే, బీజేపీ చెప్పేది మాత్రం ఆ ప్రాంతంపై పాకిస్థాన్ హస్తం పడకుండా చేయడం కోసమేననీ, అక్కడి తీవ్రవాదాన్ని అంతం చేయడానికే అని చెబుతోంది. అందుకే ఆర్టికల్ 370 రద్దు చేసినట్లు వెల్లడించింది.కాశ్మీర్ రీఆర్గనైజేషన్ చట్టాలు అన్నీ అందులో భాగంగానే చెబుతారు. మొత్తానికి ఎన్నికల ముందే కేంద్ర ప్రభుత్వం అన్ని సర్దుబాట్లూ చేసింది. జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ సీట్ల కేటాయింపులు, లెఫ్టినెంట్ గవర్నర్లకు పెంచిన అధికారాలతో బీజేపీ వ్యూహం పకడ్బంధీగా ఉంది. సుప్రీం కోర్టు ప్రమేయంతో జరిగిన ఎన్నికల్లో గెలుపు తమదంటే, తమదంటూ సవాళ్లు విసురుకున్న పార్టీలకు ఓటర్లు తమ తీర్పును చెప్పారు. ఇప్పుడున్న ప్రశ్నల్లా? జమ్మూ కశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర హోదా దక్కుతుందా..? లేదంటే, కేంద్ర పాలిత ప్రాంతంగానే కొనసాగుతుందా? అని.ఎప్పటిలాగే ఫలితాల్లో పెద్దగా మార్పు కనిపించలేదు. జమ్మూలో బీజేపీ తన ఉనికిని చూపించగా? కాశ్మీర్ వ్యాలీలో నేషనల్ కాన్ఫిరెన్స్ ప్రభావం కొనసాగింది. గతంలో బీజేపీతో పొత్తు పెట్టుకున్న మరో ప్రాంతీయ పార్టీ పీడీపీకి చుక్కెదురయ్యింది. ఎగ్జిట్ పోల్స్‌లో చెప్పినట్లు హంగ్ ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశమే లేదు. కాంగ్రెస్‌తో కలిసిన నేషనల్ కాన్ఫిరెన్స్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా అయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.అయితే, ఎన్నికలకు ముందు అటు ఒమర్? ఇటు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇద్దరి హామీల్లో కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వడం ప్రధానాంశంగా ఉంది. బీజేపీ అయితే ఎన్నికల ప్రచారంలో ఇంకాస్త ముందుకెళ్లి, బీజేపీ గెలిస్తే పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను కూడా భారత్ తిరిగి సొంతం చేసుకుంటుందని ప్రకటించారు. ఇప్పుడు, ఆ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదు. ఈ సంగతి పక్కన పెడితే? బీజేపీ చెప్పినట్లు జమ్ము కాశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర హోదా ఇస్తారా లేదా అన్నదే ఇక్కడ ప్రశ్న.ఒమర్ అబ్దుల్లా కూడా, ఎన్నికల గెలుపు తర్వాత మాట్లాడుతూ? రాష్ట్ర హోదా ఇవ్వాలనే తీర్మానాన్ని ప్రధాని నరేంద్ర మోడీకి సమర్పిస్తామని అన్నారు. ఇందులో భాగంగానే నియోజవర్గాల పునర్విభజన, ఎన్నికలు, రాష్ట్ర హోదా వరుసుగా జరుగుతాయని అన్నారు. అయితే, ఎన్నికల మూడ్‌లో ఉన్నప్పుడు కొందరు నేతలు జమ్మూ కశ్మీర్‌ను భారత రాజధాని ఢిల్లీతో పోల్చుతూ వ్యాఖ్యలు చేశారు. దీనిపై, ఒమర్ అబ్దుల్లా ఘాటుగా స్పందించారు.కాశ్మీర్‌ను ఢిల్లీతో పోల్చవద్దనీ? బీజేపీ పెద్దలే ఎన్నికల తర్వాత కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇస్తామని చెప్పినట్లు గుర్తు చేశారు. ఇక, 2019 వరకూ కాశ్మీర్ రాష్ట్రంగానే ఉందనీ? ఈ ప్రాంత ప్రజలకు తిరిగి రాష్ట్రాన్ని ఇవ్వడం కేంద్రం బాధ్యత అని అన్నారు. 2019లో జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అక్కడ రాష్ట్ర హోదా రద్దయ్యింది. జమ్మూ కశ్మీర్‌ను రెండుగా చీల్చి, లద్ధాక్, జమ్మూ కశ్మీర్‌లను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చారు. అప్పటి నుండీ కాశ్మీర్ ఎన్నికలపై కాలయాపన జరుగుతూనే ఉంది.ఇప్పుడు, ఎన్నికలు జరిగాయి. అయితే, ఈ ఎన్నికల ప్రచారంలో పలుసార్లు కేంద్ర మంత్రి అమిత్ షా.. ఎన్నికల తర్వాత జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇస్తామని అన్నారు. హోం మంత్రి అమిత్ షా చెప్పినట్లు జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇస్తామని చెప్పినప్పటికీ? ఎప్పుడు ఇస్తామన్నది మాత్రం స్పష్టంగా చెప్పలేదు. సమయం వచ్చినప్పుడు యూటీ నుండి రాష్ట్రంగా చేస్తామని అన్నారు. నిజానికి, 2019లో కశ్మీర్ రాష్ట్ర హోదాని రద్దు చేసి, కేంద్ర పాలిత ప్రాంతంగా చేసినప్పుడు ఒమర్ అబ్దుల్లా ఒక శపథం చేశారు. కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్నంత వరకూ జమ్మూ కశ్మీర్ అసెంబ్లీలో అడుగుపెట్టనని అన్నారు.తాజా ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల నుండి పోటీ చేసి, రెంటిలోనూ విజయం సాధించారు. ఇక, ఇప్పుడు ప్రభుత్వాన్ని కూడా ఆయనే ఏర్పాటు చేయనున్నారు. మరి, రాష్ట్ర హోదా వచ్చినప్పుడే అసెంబ్లీలో అడుగుపెడతానన్న అబ్ధుల్లా? కేంద్రం కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇచ్చేవరకూ పరిపాలన కొనసాగించరా అంటే కాకపోవచ్చు. ఆయన మాటలను ప్రజలు మరో విధంగా అర్థం చేసుకోవాలి. గెలిస్తే త్వరగా తీసుకొస్తామనే ఆలోచనలో అబ్ధుల్లా ఆ శపథం చేసుండాలి. ఏది ఏమైనా, అమిత్ షా మాట మీద నిలబడతారా లేదా అన్నదే ఇప్పుడు తేలాల్సి ఉంది.ఒకవేళ జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇస్తే? గతంలో ఉన్నట్లే అది లద్ధాక్‌తో కలిసి ఉంటుందా..? కాదు, ఉండదు. ఇది స్పష్టంగానే ఉంది. లద్ధాక్ ఇకపైన కూడా కేంద్ర పాలితంగా ఉంటుందన్నది స్పష్టం. ఎందుకంటే, ఆర్టికల్ 370తో ప్రత్యేక ప్రతిపత్తి గల జమ్మూ కశ్మీర్‌లో ఉన్న లద్ధాక్ మళ్లీ అందులో కలవడానికి ఆర్టికల్ 370 లాంటి పరిస్థితులు రానే రావు. ఇది కూడా అమిత్ షా గతంలోనే స్పష్టం చేశారు.అమిత్ షా వ్యాఖ్యలను బట్టి, జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370 అంశమనేది చరిత్రలో కలిసిపోయింది. ఎందుకంటే, దాని వల్లనే కశ్మీర్‌లో తీవ్రవాదం వేళ్లూనుకుంది. అందుకే, దాన్ని రద్దు చేసి, కాశ్మీర్‌ని శాంతికి, అభివృద్ధికి దగ్గర చేశాము అన్నది అమిత్ షా వ్యాఖ్యలకు అర్థం. అయితే, కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇచ్చి, తాజాగా గెలిచిన ఒమర్ అబ్ధుల్లా చేతికి పగ్గాలు ఇస్తే? మళ్లీ పాత పరిస్థితులే వస్తాయనే వాదన భవిష్యత్తులో బీజేపీ నేతలు తీసుకువస్తారా లేదా అన్నది చూడాలి. ఎందుకంటే, రాష్ట్ర హోదా ఇచ్చేది మోడీ మాత్రమే అని చెప్పిన అమిత్ షా? దీన్ని ఒమర్ అబ్ధుల్లా ఖాతాలోకి చేరనిస్తారా అనేది సందేహం. అది అవ్వదమ్మా అంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందో చూడాలి.

## మద్యం షాపుల్లోనూ... మహారాణులే..

విజయవాడ, అక్టోబరు 15, మహిళలు.. మహారాణులు.. మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్నదే మహనీయుల లక్ష్యం. అందుకు తగ్గ రీతిలో మహిళలు నేటి కాలంలో అన్ని రంగాలలో రాణిస్తున్నారనే చెప్పవచ్చు. అయితే మద్యం మాట ఎత్తితే చాలు.. చాలా వరకు మహిళలు మా కుటుంబాలు బుగ్గి పాలవుతాయని అంటుంటారు. కానీ ఏపీ కొత్త మద్యం పాలసీ అమలులోకి తెచ్చేందుకు చేపట్టిన లాటరీలో మహిళలకు కూడా జాక్ పాట్ తగిలింది. ఇదొక వ్యాపార మార్గంగా చూస్తే ఆ మహిళలకు అదృష్టం వరించినట్లే.ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక.. నూతన మద్యం పాలసీ తీసుకొస్తామని హామీ ఇచ్చింది. అదే రీతిలో నూతన మద్యం విధానం కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. అంటే ఆయా జిల్లాలలో మొత్తం ఎన్ని వైన్ షాపులు ఏర్పాటు చేస్తారో ప్రకటన జారీ చేసి.. ప్రతి ఒక్క దరఖాస్తుకు రూ. 2 లక్షలు చెల్లించాలని తెలిపి.. దరఖాస్తులను స్వీకరించింది. దీనితో 3396 మద్యం దుకాణాలకు మొత్తం 89,882 దరఖాస్తులు రాగా.. దరఖాస్తు ఫీజు ద్వారా ప్రభుత్వానికి రూ. 1797.64 కోట్ల ఆదాయం సమకూరింది. ఇక ముందుగా చెప్పినట్లుగా లాటరీ పద్ధతి ప్రకారం నేడు షాపుల ఎంపిక ప్రక్రియను కూడా అధికారులు పూర్తి చేశారు. ఈ లాటరీ పద్ధతిపై వైసీపీ నుండి పలు విమర్శలు వస్తుండగా.. వాటికి తావులేకుండా ప్రభుత్వం పటిష్ట ఏర్పాట్లు చేపట్టింది.కాగా దరఖాస్తు చేసుకున్న వారి ముందు ఒక్కొక్క లాటరీ తీసి.. ఎన్నికల్లో విజేతను ప్రకటించినట్లుగా.. అధికారులు కూడా ఆ షాప్ లాటరీలో ఎవరికి వరించిందో వారి గట్టిగా చెప్పారు. అయితే ఈ రెండు జిల్లాలలో మాత్రం పేర్లు పలికిన వెంటనే అందరూ షాక్ కు గురయ్యారు. దానికి కారణం ఎవరి పేరు తీసినా.. మహిళల పేర్లే. అదృష్టం అంటే వీరిదే.. అదే ఎన్ని దరఖాస్తులు వచ్చినా? అలా ఇలా కలియ తిప్పినా.. అక్కడ మహిళలకే అదృష్టం వరించింది.ఎన్టీఆర్ జిల్లాలో కూడా మద్యం షాపుల కోసం లాటరీ నిర్వహించారు అధికారులు. ఇక్కడ జరిగిన లాటరీ పద్ధతి ఎంపికలో ఏకంగా 16 మద్యం షాపులను మహిళలు దక్కించుకోవడం విశేషం. అంతేకాదు కృష్ణా జిల్లాలో ఏడు మద్యం షాపులను కూడా మహిళలే దక్కించుకున్నారు. దీనితో ఆ మహిళల ఆనందానికి అవధుల్లేవు. అయితే ఎన్టీఆర్ జిల్లాలో 16 షాపులు మహిళలకు కైవసం కావడం విశేషం కాగా.. లాటరీలో షాపులు దక్కని వారు సైలెంట్ అయ్యారు.ఇలా బిజినెస్ రూపంలో ఆలోచించిన మహిళలు.. మద్యం వ్యాపారంలో కూడా ముందడుగు వేయగా.. వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగాలని కోరుకుందాం అంటున్నారు అధికారులు. ఇది ఇలా ఉంటే ప్రకాశం జిల్లాలో మాత్రం ఓ వైపు లాటరీ పద్ధతి సాగుతుండగా.. మరో వైపు మద్యం నూతన పాలసీని రద్దు చేయాలని నిరసన తెలపడం మరో విశేషం. చివరకు నిరసన తెలుపుతున్న వారిని పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అదుపులోకి తీసుకున్నారు. చివరగా.. మద్యం షాపు దక్కించుకున్న మహిళలకు.. బెస్ట్ ఆఫ్ లక్ చెప్పేద్దాం.. తప్పేముంది వ్యాపార మార్గంగా ఆలోచిస్తే చెప్పండి !

లాటరీల్లో పదనిసలు

శ్రీకాకుళం జిల్లాలో లాటరీ సందర్భంగా గందరగోళం చోటు చేసుకుంది. అంబేద్కర్ ఆడిటోరియంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పర్యవేక్షణలో లక్కీ డ్రా జరుగుతుండగా.. ఆమదాలవలస సర్కిల్ పరిధిలోని 42వ మద్యం షాపు విషయంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఈ దుకాణానికి సంబంధించిన డ్రాలో 9వ నెంబర్ వస్తే దాన్ని అధికారులు పొరపాటున 6వ నెంబర్ అని మైక్‌లో బహిరంగంగా అనౌన్స్ చేశారు. దీంతో 6వ నెంబర్ దరఖాస్తుదారుడు సంబరపడ్డాడు. అయితే, అది 6ను తిప్పితే 9 అవుతుందని.. దాన్ని క్రాస్ చెక్ చేయాలని అధికారులను కోరగా.. అది 9 అని తేలింది. దీంతో మళ్లీ అధికారులు వెంటనే 9వ నెంబర్ అని ప్రకటించారు. దీంతో 6వ నెంబర్ వ్యక్తి తీవ్ర నిరాశకు గురయ్యాడు.ఇదే క్రమంలో అధికారులు కావాలనే నెంబర్ మార్చేశారంటూ వారితో వాగ్వాదానికి దిగాడు. తోటి దరఖాస్తుదారులు సైతం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం షాపుల కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నామని.. ఇలాంటి సమయంలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అంటూ మండిపడ్డారు. అనంతరం అధికారులు ఆందోళనకారులకు జరిగింది వివరించి సద్దిచెప్పారు. దీంతో వారు శాంతించగా లాటరీ ప్రక్రియ యథావిధిగా సాగింది.అటు, రాష్ట్రవ్యాప్తంగా లక్కీడ్రా ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. లాటరీల్లో దుకాణాలు దక్కించుకున్న వారు నగదు సమీకరించుకునే పనిలో పడ్డారు. ఈ లాటరీలో కొందరి పంట పండింది.

బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి ఏకంగా 5 దుకాణాలను దక్కించుకున్నారు. పుట్టపర్తిలో కలెక్టర్ చేతన్ ఆధ్వర్యంలో లాటరీ తీయగా.. ధర్మవరం మున్సిపాలిటీ దుకాణం 1, 4.. ధర్మవరం రూరల్‌లో 12, ముదిగుబ్బ మండలంలో 19, బత్తలపల్లి మండలంలో 14వ నెంబర్ దుకాణాలు ఆయనకు వచ్చాయి. ఒకే వ్యక్తికి ఐదు దుకాణాలు రావడం నిజంగా అదృష్టమేనని అంతా చర్చించుకుంటున్నారు.అటు, రాష్ట్రంలో బుధవారం నుంచి కొత్త మద్యం విధానం అమల్లోకి రానుంది. లాటరీ కేంద్రాలు జన జాతరను తలపించాయి. దరఖాస్తు ఫీజు ద్వారా రూ.1797.64 కోట్ల ఆదాయం వచ్చింది. ఎక్కువ దుకాణాలు తిరుపతి జిల్లాలో ఉంటే అతి తక్కువ అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్నాయి. తిరుపతి 227 దుకాణాలకు అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. అల్లూరి సీతారామారాజు జిల్లాలో 40 మాత్రమే దుకాణాలు ఉన్నాయి. పోటీ ఎక్కువ ఎన్టీఆర్ జిల్లాలో ఉంటే తక్కువ అనంతపురం జిల్లాలో ఉంది. డ్రాలో దుకాణం దక్కించుకున్న వ్యాపారులు 24 గంటల్లో లైసెన్స్ ఫీజు చెల్లించాలి. ఈ నెల 15న ప్రైవేట్ వ్యక్తులకు మద్యం దుకాణాలను అప్పగించనుంది. 16వ తేదీ నుంచి నూతన మద్యం విధానం అమల్లోకి రానుంది. రాష్ట్రంలో అన్ని బ్రాండ్ల బ్రాండెడ్ మద్యం అందుబాటులోకి రానుంది.

## షర్మిళ రాజకీయం షురూ...



కడప, అక్టోబరు 15,వైయస్ షర్మిళ అంటే తెలియని వారుండరు. నేటి రాజకీయాల్లో ఈమె మాట ఎప్పుడూ వినిపిస్తూనే ఉంది. ప్రస్తుతం ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న వైయస్ షర్మిళ .. తన రాజకీయ భవిష్యత్ కోసం వడివడిగా అడుగులు వేస్తున్నారనే చెప్పవచ్చు. అయితే పొలిటికల్ ఫ్యామిలీ నుండి వచ్చినా షర్మిళ గురి.. ఏకంగా సీఎం సీటు అయినప్పటికీ ఆ అదృష్టాన్ని పరిక్షించుకోవడానికి ఇంకా సమయం ఉంది. అప్పటిలోగా తాను బలాన్ని పెంచుకోవాలని, ఏపీలో నెంబర్-2 పార్టీగా కాంగ్రెస్ ఉండాలన్న భావనతో షర్మిళ ముందడుగు వేస్తున్నా.. అది ఫలించేనా లేదా అన్నది ఎన్నికల సమయంలో పరిస్థితులను బట్టి చెప్పవచ్చని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.ఏపీలో కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేతబట్టిన షర్మిళ.. దివంగత ముఖ్యమంత్రి వైయస్సార్ కుమార్తెగా రాష్ట్ర ప్రజలందరికీ సుపరిచితమే. తన అన్న వైయస్ జగన్ వైసీపీని ఏర్పాటు చేసిన సమయంలో షర్మిళ బ్యాక్ బోన్ అని చెప్పవచ్చు. జగన్ అరెస్ట్ సమయంలో.. నేనున్నా అంటూ రాష్ట్ర పాదయాత్ర నిర్వహించారు ఆమె. ఆ సమయంలో వైసీపీ నెంబర్-2 నేత షర్మిళ అనుకున్నారు అంతా. కానీ పార్టీ అధికారంలోకి రాగానే ఆమె సైడ్ అయ్యారు అలాగే సైలెంట్ అయ్యారు.పొలిటికల్ గా రాణించాలని, ప్రజాసేవలో ఉండాలనే భావన ఉన్న షర్మిళ.. అనూహ్యంగా తెలంగాణలో కొత్త పార్టీ స్థాపించారు. మారిన రాజకీయ పరిణామాలతో ఆమె కాంగ్రెస్ వైపుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడే కాంగ్రెస్ వేసిన వ్యూహం ఫలించిందని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. ఏపీలో అధికారంలో ఉన్న జగన్, ఎదురుతిరిగి పార్టీ ఏర్పాటు చేసుకోగా.. అన్నకు పోటీగా చెల్లెలిని రంగంలోకి దింపింది కాంగ్రెస్ అధిష్టానం. ఏపీ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ప్రకటించి.. ఆల్ పొలిటికల్ పార్టీస్ కి షాకిచ్చిందని చెప్పవచ్చు.ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో అన్ని నియోజకవర్గాలలో కాంగ్రెస్ అభ్యర్థులను నిలబెట్టడంలో షర్మిళ విజయవంతమయ్యారు. కడప ఎంపీగా బరిలో నిలిచిన షర్మిళ దురదృష్టవశాత్తు ఓటమి చవిచూసినా.. గట్టిపోటీ ఇచ్చారని చెప్పవచ్చు. నెక్స్ట్ ఎలక్షన్స్ సమయానికి తనదైన శైలిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసుకొని.. తన బలం నిరూపించుకొనేందుకు షర్మిళ ఇప్పటి నుండే పావులు కదుపుతున్నారని పొలిటికల్ టాక్.11 స్థానాలకు పరిమితమైన వైసీపీ.. ప్రజల్లోకి వెళ్లేందుకు ఇప్పటి నుండే గ్రామాల బాట పట్టే అవకాశం ఉంది. దీనికి కారణం పార్టీ వలసల నివారణే అన్నది పొలిటికల్ విశ్లేషకుల అంచనా. వైసీపీ నుండి కాంగ్రెస్ లోకి వలసలు అంత ఈజీ కానప్పటికీ.. చాలా వరకు వైసీపీ నేతలు కాంగ్రెస్ వైపుకు చూస్తున్నారని, కానీ ఎన్నికలకు రెండేళ్ల ముందు పార్టీ తీర్థం పుచ్చుకొనే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకులే తెలుపుతున్నారు. అయితే ఇటీవల కూటమి, వైసీపీపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్న షర్మిళ.. సైలెంట్ గా అన్ని నియోజకవర్గాల్లో పార్టీ క్యాడర్ బలం పెంచుకొనే పనిలో ఉన్నారట. ఎలాగైనా నెక్స్ట్ ఎన్నికల సమయానికి తాను అనుకున్న టార్గెట్ చేరుకోవాలని భావిస్తున్న షర్మిళ.. కోరిక నెరవేరుతుందా.. లేదా వేచి చూడాలి. అప్పటిలోగా రాజకీయ ముఖచిత్రంలో ఎన్ని మార్పులు జరుగుతాయో కదా..

## ఎపిని నిలబెట్టేలా సాయం అందాలి

**విబజన సమస్యలపై చిత్తశుద్ధి కావాలి**

**పోలవరం, అమరావతికి త్వరగా సహకరించాలి**

విజయవాడ,అక్టోబర్15): ఎన్డీఎలో ఉంటూ ఎంతోకాలంగా బిజెపితో చెలిమిగా ఉంటున్న అనేక పార్టీల్లో ఇప్పుడు అసంతృప్తి రగులుతోంది. దేశంలో పరిస్థితులపై ఎన్డీఎ పక్షాలతో చర్చించే అవకాశం లేదు. చర్చిద్దామని అడిగే ధైర్యం ఆయా పార్టీలు చేయడం లేదు. ఈ పార్టీలన్నీ రేపు ప్రజల ముందు సంజాయిషీ ఇచ్చుకోక తప్పదు. మోడీ వ్యవహార శైలిని గట్టిగా విమర్శిస్తూ సవాల్ విసిరిన పార్టీలు అడ్రస్ లేకుండా పోయాయి. ఎపిలో టిడిపి మళ్లీ ఎన్డీయే కూటమితో జతకట్టి, కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కూటమి నుంచి బయటకు వెళితే తమకు పుట్టగతులు ఉండవన్న భయం కూడా ఆయా పార్టీల్లో ఉండివుంటుంది. బీజేపీ వైఖరిపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం అవుతున్నా బయటపడడం లేదు. కేంద్రంలో బీజేపీ మూడో పర్యాయం అధికారానికి వచ్చినప్పటి నుంచీ ఆయా పార్టీల్లో అసంతృప్తి రగులుతున్నది. నిజానికి అధికారంలోకి వచ్చిన తర్వాత నరేంద్ర మోదీ తీసుకున్న గొప్ప నిర్ణయాలు ఏమీ లేవు. యూపీఏ పాలనలో చోటుచేసుకున్నాయని చెబుతున్న అవినీతి కుంభకోణాలతో ప్రజలు విసుగెత్తి ఉండటాన్ని గమనించిన మోదీ, అవినీతిపై యుద్ధం ప్రకటిస్తున్నానని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో పెద్దనోట్లను రద్దు, జీఎస్టీని అమలులోకి తెచ్చారు. ఈ రెండు నిర్ణయాలు దేశ ప్రజలను అగాథంలోకి నెట్టాయి. ఈ దశలో విభజన సమస్యలను పెడచెవిన పెట్టిన కేంద్రం తీరుపై ఎపి నేతలు రగిలిపోయారు. రాజకీయ పార్టీల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజలు మాత్రం తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తంచేస్తున్నారు. భారతీయ జనతా పార్టీ తమకు తీవ్ర అన్యాయం చేసిందని రగిలిపోతున్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేయగా, ఇప్పుడు భారతీయ జనతా పార్టీ అంతకంటే దారుణంగా వ్యవహరిం చిందనీ, నమ్మించి గొంతు కోసిందని విమర్శలు వెల్లువెత్తున్నాయి. నిధుల కేటాయింపులు, నీళ్ల పంపకాల్లో తెలంగాణ ప్రభుత్వం కూడా అసంతృప్తి వ్యక్తంచేసి ఎదురుదాడి చేస్తోంది. తెలంగాణ ప్రజల కోరిక మేరకు రాష్ట్ర విభజనకు పూనుకున్న ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం, తమను దిక్కులేని వారిని చేసిందన్న ఆవేదన ఏపీ ప్రజలలో ఏర్పడింది. ఆ కారణంగానే నరేంద్ర మోదీ,చంద్రబాబు జంట అధికారంలోకి వస్తే తమకు న్యాయం జరుగుతుందని ఆశలు పెంచుకున్నారు. కానీ అడియాశలు అయ్యాయి. పదేళ్లు గడిచినా ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో కేంద్రం నుంచి రాష్ట్రానికి సహాయం అందడంలేదు. ఏపీకి ప్రత్యేక హోదా లభిస్తే పరిశ్రమలు వచ్చి రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజానీకం ఆశించింది. అయితే మోదీ ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్రత్యేక ప్యాకేజీ పేరుతో ఊరించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత మళ్లీ కొంత విదిల్చడం మొదలయ్యింది.

## ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయం.

**ఎండపల్లి తహసిల్దార్ల రవికాంత్.**

కమాన్ పూర్/ఎండపల్లి,ప్రజలకు సేవ చేసే ప్రజాహిత కార్యక్రమాలు చేయడం హర్షనీయమని ఎండపల్లి తహసిల్దార్ కడార్ల రవికాంత్ అన్నారు. మంగళవారం ఎండపల్లి మండలంలోని గుల్లకోటలో కమాన్ పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి భారీ ఎత్తున స్పందన లభించింధి. ఈ సందర్భంగా తహసిల్దార్ రవికాంత్ మాట్లాడుతూ పుట్టిన గ్రామాన్ని మరువకుండా సానా రామకృష్ణారెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయ మని అన్నారు. తాను పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామంలో స్థిరపడ్డ తన గ్రామానికి సేవ చేయాలనే దృక్పథంతో ఇక్కడ ప్రజాహిత కార్యక్రమమైన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే గుండ్లకోటలో సాన వారి కుటుంబ సభ్యులు ఇప్పటికే గ్రామ కమాన్ ను అలాగే వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఆలయం వద్ద హాల్ నిర్మించడం జరిగింది. అలాగే బస్టాండ్ ను కట్టించడం జరిగిందని అన్నారు. అలాగే గ్రామంలో మరిన్ని ప్రజలకు ఉపయోగ పడే పనులు చేయాలని కోరుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి లయన్ నల్లవెల్లి శంకర్ సభ్యులు లయన్ జబ్బర్ ఖాన్ లయన్ చంద్రమౌళి స్థానికులు సాన జయకర్, మారుతి, మాజీ సైనికులు ముదిగంటి వెంకట రమణారెడ్డి, జావా మహిపాల్ రెడ్డి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రాజిరెడ్డి, సింహాచలం జగన్, సాన ప్రభాకర్, పాదం తిరుపతి బీసగొని సత్యం, భూసారపు రమేష్, పొన్నం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల పరిశీలకులు.. తెలంగాణ మంత్రులకు చోటు



న్యూఢిల్లీ: మహారాష్ట్ర జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను కేంద్ర ఎన్నికల సంఘం మరికాసేపట్లో ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో ఆ రెండు రాష్ట్రాల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ పరిశీలకులను నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ (ంఎఅఅ) మంగళవారం మధ్యాహ్నం ఉత్తర్వులు జారీ చేసిందిజార్ఖండ్‌కు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు ఆ పార్టీ సీనియర్ నేతలు తారిక్ అన్వర్, అధిర్ రంజన్ చౌదరిని నియమించారు. ఇక మహారాష్ట్రలోని 5 డివిజన్లకు 11 మంది పరిశీలకులను నియమించగా.. అందులో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్కకు బాధ్యతలు అప్పగించారు.

## నూకల నరేష్ రెడ్డికి నివాళులు అర్పించిన హరీశ్ రావు



మహబూబాబాద్ : ప్రముఖ రాజకీయ నాయకుడు, ఉద్యమకారుడు నూకల నరేష్ రెడ్డికిమాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావునివాళులు అర్పిం చారు. నరేష్ రెడ్డి దశదిన కార్యక్రమానికి హాజరైన హరీశ్ రావు నరేష్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. హరీశ్ రావు వెంట మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, పెద్ది సుదర్శన్ రెడ్డి తదితరులు ఉన్నారు. కాగా, నరేష్ రెడ్డి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

## మనదేశ డేటా మనవద్దే ఉండాలి: ఆకాశ్ అంబానీ

న్యూఢిల్లీ: స్వదేశీ కృత్రిమ మేధస్సు సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మెన్ ఆకాశ్ అంబానీ పిలుపునిచ్చారు. ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ఆయన మాట్లాడారు. స్వదేశీ ఏఐ సామర్థ్యం, అప్లికేషన్స్ పెంచేందుకు.. స్వదేశీ డేటా సెంటర్లను కూడా అభివృద్ధి చేయాలన్నారు. ఇక భారత్‌కు చెందిన డేటాను భారత్‌లోనే ఉంచాలని ఆయన అభిప్రాయపడ్డారు. దీని కోసం డేటా సెంటర్ పాలసీని ప్రభుత్వం తీసుకురావాలని ఆయన కోరారు. మానవ మెదడు సృష్టించిన విప్లవాత్మకమైన సాధనం ఏఐ అని, మన జీవితాన్ని, సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థను ఆ టూల్ మార్చేస్తుందన్నారు. 2047 నాటి వరకు వికసిత్ భారత్ సృష్టించాలన్న కలను సాకరం చేయడంలో కీలక పాత్ర పోషించనున్నట్లు చెప్పారు.



# అందరికీ ఆదర్శం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం : డీఎస్పీ రామాంజి నాయక్



ఆత్మకూరు పట్టణంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్మారక సమితి అధ్యక్షులు శీలం శేషు, సెక్రటరీ జవహర్ నాయక్,ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి,భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారి 93వ జన్మదినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం జరిగింది. మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక జగద్గురు మటంలో కన్నుల పండుగగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్ , ఎంఈఓ సురేష్,, పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎస్పి రామాంజి నాయక్ మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణ కలిగి పట్టుదల తో చదువుకొని తల్లిదండ్రులకు ఉన్న ఊరుకు మంచి పేరు తీసుకుని రావాలని, డాక్టర్ అబ్దుల్ కలాం గారిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు . ఈ కార్యక్రమంలో పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. సమాజం మేలుకొలుపు కోసము అనునిత్యం ప్రజల మధ్యన స్వచ్ఛందంగా శ్రమిస్తున్న ప్రకృతి ప్రేమికుడు వెంకటసుబ్బయ్య, 54 సార్లు రక్తదానం చేసి , రామ్ ప్రసాదు,, రిటైర్డ్ హెడ్మాస్టర్ మక్బూల్ బాషా, పరిసరాల శుభ్రతలో తనకంటూ ఒక ప్రత్యేకతను పెట్టిన అల్తాఫ్ హుస్సేన్, రిటైర్డ్ పంచాయతీ సెక్రెటరీ ప్రభాకర్, వృద్ధా శ్రమమును నిర్వహిస్తున్న యుగంధర్, పేదలకు సహాయం చేస్తున్న ఆకుల సలాం . లకు డీఎస్పీ రామాంజి నాయక్, ఎంఈఓ సురేష్ లు సన్మానం చేసి మెమెంటోను అందజేశారు అబ్దుల్ కలాం గారి జీవిత చరిత్ర పై వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు . మహిళా పారిశుద్ధ కార్మికులకు, గిరిజన మహిళలకు చీరలు బహుకరించారు ఈ కార్యక్రమంలో అబ్దుల్ కలాం స్వార్ధ కమిటీ నాయకులు శీలం శేషు, జవహర్ నాయక్, వాసుదేవ రెడ్డి ,అల్తా హుసేన్ రియాజ్ ,సుధాకర్ డ్రిల్ మాస్టర్ దేవానంద్, తదితరులు పాల్గొన్నారు

# పెట్రోల్ బంకుల్లో ఆకస్మిక తనిఖీలు

అనంతపురం : అనంతపురం, సత్యసాయి జిల్లాల్లోని అనేక పెట్రోల్ బంకుల్లో చిప్పులు ఉన్నాయని వైరల్ కావడంతో ఆయిల్ కంపెనీ అధికారులు ఆకస్మిక తనిఖీలు ప్రారంభించారు. విషయం ప్రభుత్వ దృష్టికి రావడంతో జిల్లా అధికారులు కూడా ఈ విషయంపై సీరియస్ గా ఉన్నారు. కొంతమంది పెట్రోల్ బంకుల నిర్వాహకులు అధికారులను తప్పుదోవ పట్టించడం, చిప్పులు పెట్టిన కొంతమందికి అధికారులు అండగా ఉండడంతోనే అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో చిప్పుల వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా ఇంతకాలం సాగింది.

# మరో వివాదంలో కోనేటి

తిరుపతి, అక్టోబరు 15, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు కాలం కలిసి రాలేదా? ఏదో విధంగా ఆయనను వివాదాలు చుట్టు ముట్టుతున్నాయా? మళ్లీ వార్తల్లోకి రావడానికి కారణమేంటి? తాజాగా ఆడియో టేప్‌లు ఏం చెబుతున్నాయి? దీనిపై మళ్లీ చర్చించుకోవడం ప్రజల వంతైంది.లేటెస్ట్‌గా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం.. ఓ మహిళతో మాట్లాడిన ఆడియో టేప్ వెలుగులోకి వచ్చింది. నువ్వు చాలా అందంగా ఉన్నావు.. పర్సనాలిటీ చాలా బావుందని వ్యాఖ్యానించారు సదరు ఎమ్మెల్యే. ఈ ఆడియో సోషల్ మీడియా లో వైరల్ అవుతోంది.నెల రోజుల కిందట ఎమ్మెల్యే ఆదిమూలం తనపై అత్యాచారం చేశాడంటూ ఓ మహిళ ముందుకొచ్చింది. అంతేకాదు ఏకంగా వీడియోలు విడుదల చేసింది. ఆ వివాదం ముగియకముందే మరో ఆడియోతో వెలుగులోకి వచ్చారు ఎమ్మెల్యే ఆదిమూలం.సత్యవేడుకు చెందిన టీడీపీకి చెందిన ఓ మహిళా కార్యకర్తను ఎమ్మెల్యే ఆదిమూలం లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో ఆయనను టీడీపీ హైకమాండ్ సస్పెండ్ చేసింది. ఈ వ్యవహారంలో బాధిత మహిళను న్యాయస్థానం ముందు హాజరై స్వయంగా వివరణ ఇచ్చుకుంది. ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించిన అంశాలన్నీ అవాస్తమని పేర్కొంది. కొద్ది రోజుల కిందట సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనను వేధిస్తున్నారంటూ టిడిపికి చెందిన ఓ మహిళ నేత ఆరోపించారు. అంతటితో ఆగకుండా తిరుపతిలోని ఓ లాడ్జిలో ఎమ్మెల్యే తనపై లైంగిక దాడి చేశారంటూ సీక్రెట్ కెమెరాతో తీసిన ఫోటోలు, వీడియోను బయటపెట్టారు. ఏకంగా టిడిపి అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన హై కమాండ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పై సస్పెన్షన్ వేటు వేసింది. అదే సమయంలో బాధిత మహిళ నేత ఫిర్యాదు మేరకు కేసు నమోదయింది. కోర్టులోకి చేరింది ఈ అంశంఅయితే ఈ కేసు విషయంలో రాజీ పడ్డారు బాధిత మహిళ. తనపై ఎమ్మెల్యే ఆదిమూలం ఎటువంటి వేధింపులకు పాల్పడలేదంటూ ఆమె తరుపు న్యాయవాది లిఖితపూర్వకంగా కోర్టులో తెలియజేశారు. దీంతో కేసు రాజీకి మార్గం ఏర్పడింది. అయితే ఇంతలో అదే ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గొంతుతో కూడిన ఆడియో హల్ చల్ చేస్తోంది. తెగ వైరల్ అవుతోంది. అయితే ఆ గొంతు ఎమ్మెల్యే ఆదిమూలానిదా? కాదా? అన్నది తేలాల్సి ఉంది.బాధితురాలితో తాము రాజీకి వచ్చామని కేసు అవసరం లేదని ఎమ్మెల్యే తరపు అడ్వకేట్ న్యాయస్థానం ముందు చెప్పిన విషయం తెల్సిందే

# కూటమిలో లుకలుకలు...

విజయవాడ, అక్టోబరు 15, కూటమిలో లుకలుకలు ప్రారంభమయ్యాయా? మూడు పార్టీల మధ్య సమన్వయం కొరవడుతోందా? విభేదాలకు దారితీస్తోందా? ఇదే పరిస్థితి కొనసాగితే పూర్తి ధర్మానికి విఘాతం కలగడం ఖాయమా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ఈ ఎన్నికల్లో కూటమి గెలిచింది. ఏకంగా మూడు పార్టీలు కలిసి 164 అసెంబ్లీ సీట్లు సాధించాయి. మూడు పార్టీలు కలిసి ఉమ్మడిగా ప్రభుత్వాన్ని నడుపుతున్నాయి. జనసేనకు మూడు మంత్రి పదవులు, బిజెపికి ఒక క్యాబినెట్ మినిస్టర్ పదవి దక్కింది. అయితే మరో దశాబ్ద కాలం పాటు పొత్తు ధర్మం కొనసాగాలని చంద్రబాబుతో పాటు పవన్ భావిస్తున్నారు. ఇదే విషయాన్ని ఆ పార్టీల ఎమ్మెల్యేలకు, శ్రేణులకు హితబోధ చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మూడు పార్టీల శ్రేణుల మధ్య సమన్వయం లోపిస్తే.. అది అంతిమంగా వైసీపీకి ప్రయోజనం చేకూరుస్తుందని హెచ్చరించిన సందర్భాలు ఉన్నాయి. అయితే జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న చోట.. టిడిపి డీలా పడుతోంది. అక్కడ దశాబ్దాల కాలంగా జండా మోసిన టిడిపి శ్రేణులు ఉన్నాయి. వారిని జనసేన ఎమ్మెల్యేలు కలుపుకొని వెళ్లడం లేదన్నది ప్రధాన ఆరోపణ. ఈ తరుణంలో జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న చోట ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. ఎప్పటికప్పుడు విభేదాలు వెలుగు చూస్తున్నాయి. తాజాగా ఈరోజు ప్రారంభమైన పల్లె పండుగలో రాష్ట్రవ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో విభేదాల పర్వం బయటపడింది. ముఖ్యంగా కందుల దుర్గేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో అయితే టిడిపి శ్రేణులు నిలదీసినంత పని చేశారు. దీంతో ఒక్కసారిగా ఈ అంశం సంచలనంగా మారిందిఈ ఎన్నికల్లో చివరి నిమిషంలో నిడదవోలు నియోజకవర్గ టికెట్ దక్కించుకున్నారు కందుల దుర్గేష్. అటు టిడిపి శ్రేణులు సైతం ఆయన రాకను వ్యతిరేకించాయి. అయితే అధినేత చంద్రబాబు సర్ది చెప్పడంతో సమ్మతించాయి. అయితే అక్కడ టిడిపి శ్రేణులతో మంత్రికి గ్యాప్ ఉంది. ఈరోజు ప్రారంభమైన పల్లె పండుగ కార్యక్రమానికి టిడిపి శ్రేణులకు ఆహ్వానం లేదు. ఈ తరుణంలో నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి కందుల దుర్గేష్ ను టిడిపి శ్రేణులు నిలదీసినంత పని చేశాయి. అయితే మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటానని కందుల దుర్గేష్ వారికి సముదాయించడం విశేషం.మొన్న ఆ మధ్యన ధర్మవరంలో మంత్రి సత్య కుమార్ యాదవ్ ను టిడిపి శ్రేణులు అలానే నిలదీసినంత పని చేశాయి. అయితే ఈ ఇద్దరే కాదు. రాష్ట్రవ్యాప్తంగాబిజెపి, జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న 29 అసెంబ్లీ స్థానాల్లో టిడిపి శ్రేణులు ఇదే దూకుడును కనబరుస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యేలతో విభేదిస్తున్నాయి. దీంతో ఒక రకమైన గందరగోళ వాతావరణం కొనసాగుతోంది. పరిస్థితి నివురుగప్పిన నిప్పులా మారుతోంది. రెండు దశాబ్దాల పాటు పొత్తు కొనసాగాలన్న అధినేతల ఆకాంక్షలకు తగ్గట్టు పరిస్థితి లేదు. ఇలానే కొనసాగితే ఇబ్బందికర పరిస్థితులు తప్పేలా లేవు. మరి పార్టీ అధినేతలు ఎలాంటి ఆదేశాలు ఇస్తారో చూడాలి.

# గుల్లలమోదలో క్షిపని పరీక్షా కేంద్రం

అవనిగడ్డ,అవనిగడ్డ నియోజకవర్గం గుల్లలమోద గ్రామంలో క్షిపణి పరీక్షా కేంద్రం అభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ సారథ్యంలోని హై లెవెల్ సెక్యూరిటీ కమిటీ ఆమోదం తెలపడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డ లోని బుద్ధప్రసాద్ స్వగృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రం మంజూరు చేయడం ద్వారా అవనిగడ్డ నియోజకవర్గానికి కేంద్రం మహత్తర ప్రాజెక్టును ఇచ్చిందని అన్నారు. రాకెట్ ప్రయోగాలకు అనువైన ప్రాంతంగా గుల్లలమోద గ్రామాన్ని శాటిలైట్ ద్వారా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం దాదాపు 30,000 కోట్ల రూపాయలతో ప్రాజెక్టు నిర్మించనున్నారని అన్నారు. దీనికి సహకరించిన దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రక్షణ శాఖ మంత్రి, డిఆర్డీవో పూర్వపు చైర్మన్ సతీష్ రెడ్డి లకు బుద్ధప్రసాద్ ధన్యవాదములు తెలిపారు.

# వాటాలు ఇవ్వాల్సిందే

## జేసీ ప్రభాకరరెడ్డి హుకుం

అనంతపురం, అక్టోబరు 15, టీడీపీ నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పేకాట క్లబ్‌లు, ఇసుక వ్యాపారం చేసేవారు వారి సంపాదనలో 15 శాతం కమిషన్ ఇవ్వాలని హెచ్చరించారు. ఇదంతా నియోజకవర్గ అభివృద్ధికి వినియోగించాలన్నారు. తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధికి తాను 20 శాతం డబ్బులు ఖర్చు చేస్తానని, తనకు ఒక్క రూపాయి కూడా వద్దన్నారు. దశాబ్దాల నుంచి తాము రాజకీయాల్లో ఉన్నామని, ప్రజలు తమకు అండగా ఉన్నారని.. నియోజకవర్గ అభివృద్ధి ఇలాంటివి తప్పదన్నారు. వారితో పాటు మద్యం షాపు నిర్వాహకులు తనకు 35 శాతం కమిషన్ ఇవ్వాలని హుకూం జారీ చేయడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో తాడిపత్రి రాజకీయాలు వేరయా అంటున్నారు.ఓవైపు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడ్రిపత్రిలోకి రాలేకపోతున్నారు. మరోవైపు జేసీ వర్గీయులు నియోజకవర్గంలో కొత్త రూల్స్ పెడుతున్నారు. రాజకీయ ప్రత్యర్థులు తాడిపత్రిలో లేకుండా ఉండాలంటూ గతంలోనే జేసీ ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు అభివృద్ధి పేరుతో కమిషన్లు ఇవ్వాలని నేరుగా అడగడం నియోజకవర్గంలో హాట్ టాపిక్ అవుతోంది. కమిషన్లుగా తీసుకున్న డబ్బును తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేయడం ఏంటని స్థానికులతో పాటు వైసీపీ శ్రేణులు ఆశ్చర్యపోతున్నాయి. అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో తాడిపత్రి నియోజకవర్గం కాస్త వెరైటీ అని చెప్పవచ్చు. అక్కడ రాజకీయాలు భిన్నంగా ఉంటాయి. టీడీపీకి చెందిన నాయకులు, తన అనుచరులే ఇసుక దోచుకుంటున్నారని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇటీవల ఓ వీడియో విడుదల చేశారు. పైగా ఆయన కుమారుడు ప్రస్తుత ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి కావడంతో ప్రభుత్వంపై విమర్శలు కూడా వచ్చాయి. గడిచిన అయిదేళ్లుగా తనకు అండగా నిలిచిన నాయకులు, ఇప్పుడు తాడిపత్రిలో ఇసుకను అక్రమంగా



దోచుకుని జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలంటూ తాను గ్రీన్ ట్రైబ్యునల్, హైకోర్టులు, అధికారుల చుట్టూ తిరిగి పోరాటం చేస్తే.. ఇప్పుడు తన అనుచరులే ఇసుక దందా చేస్తున్నారని వీడియో రిలీజ్ చేశారు. తాడిపత్రి నియోజకవర్గంలో దాదాపు 2.5 లక్షల మంది ఉంటే, కేవలం 25 మంది ఇసుక దందా చేసి దోచుకుంటున్నారని జేసీ ప్రభాకకర్ రెడ్డి ఆరోపించారు. మీ దందా, ఇసుక అక్రమరవాణా మరెక్కడైనా చేసుకోండి, కానీ నా నియోజకవర్గంలో కనుక కనిపిస్తే మీ టిప్పర్ బండ్లు ఇక బయటకు కూడా రావని టిప్పర్ ఓనర్లను సైతం హచ్చరించారు. తాడిపత్రిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లపై కేసులు పెట్టాలని ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి సీఐ లక్ష్మీకాంత్ రెడ్డికి ఫోన్ చేశారు. అయితే తమకు విషయం వదిలేస్తే, చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని, ఎప్పుడేం చేయాలేం మీరు చెబుతారా అని సీఐ అడగటంతో వివాదం మొదలైంది. అది చివరికి సీఐ వర్సెస్ ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డిగా మారింది. సీఐకి మద్దతు తెలిపాల్సిన పోలీసు ఉన్నతాధికారులు సైతం అందుకు భిన్నంగా సీఐతో ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డికి క్షమాపణలు సైతం చెప్పించారు. దాంతో రాష్ట్రంలో ఇది సపరేట్ నియోజకవర్గం అని తాడిపత్రిపై మరోసారి చర్చ జరుగుతోంది.

# ఏపీకి వరదల ముప్పు...

విశాఖపట్టణం, అక్టోబరు 15,బంగాళాఖాతంలో అక్టోబర్ ? నవంబర్ మధ్యకాలంలో తుఫాన్లు ఏర్పడుతుంటాయి. ఈ సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వర్షాల ముప్పు పొంచి ఉంటుంది. సాధారణంగా ప్రతి ఏడాది అక్టోబర్ నెలలో నైరుతి రుతుపవనాలు నిస్తేజంగా మారతాయి. ఆ తర్వాత ఈశాన్య రుతుపవనాలు ఎంట్రీ ఇస్తాయి. ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించే కాలంలో సముద్ర ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. ఇవి బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడేందుకు అనుకూలంగా ఉంటాయి. అవిక్రమంగా వాయుగుండాలుగా రూపాంతరం చెందుతాయి. అప్పుడప్పుడు పెను తుఫాన్లుగా మారతాయి. ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. అది తీవ్ర వాయుగుండం గా మారి.. ఆ తర్వాత తుఫాన్ గా రూపాంతరం చెంది అవకాశముందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. గత పది సంవత్సరాల కాలంలో అక్టోబర్ ? డిసెంబర్ మధ్యకాలంలో 11 తుఫాన్లు చోటుచేసుకున్నాయి. అందులో ఆరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తీరం దాటడం విశేషం.బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కాస్త అల్పపీడనంగా మారింది. అది నెలకొన్న చెన్నై తీరం వరకు బంగాళాఖాతం ఉపరితల ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. ఈ ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే అరేబియా సముద్రంలో అల్పపీడనం తీవ్ర రూపు దాల్చింది. ఇది తీవ్రవాయుగుండం గా మారుతోందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. అది అక్కడి నుంచి బంగాళాఖాతంలో ఉన్న అల్ప పీడనం వరకు ఆవరించి ఉందని తెలుస్తోంది. గత సెప్టెంబర్ నెలలో ఇదే తీరుగా బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది. అదే సమయంలో అరేబియా సముద్రం పై తుఫాన్ ఆవరించి ఉంది.. అప్పుడు రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి..ఫలితంగా ఏపీలోని విజయ వాడలో విపరీతంగా వర్షాలు కురిసాయి. ఈసారి కూడా అదే స్థాయిలో భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

గత 10 సంవత్సరాలలో ఇలా..

2014 సంవత్సరంలో హుద్ హుద్ తుఫాన్ ఏర్పడింది.. ఆ తుఫాన్ వల్ల విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి..ఆ తుఫాన్ విశాఖపట్నంలో తీరం దాటింది.

2016 లో డిసెంబర్ నెలలో వార్దా తుఫాన్ కాకవికలం సృష్టించింది. తుఫాన్ వల్ల నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, కడప జిల్లాలో తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. వార్ధా తుఫాను నెల్లూరులో తీరం దాటింది. 2018 అక్టోబర్ నెలలో తిత్లీ తుఫాన్ ఏర్పడింది.. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు ఈ తుఫాన్ వల్ల నష్టపోయాయి.. శ్రీకాకుళంలో ఈ తుఫాన్ తీరం దాటింది. 2018 డిసెంబర్లో పెతాయ్ తుఫాన్ ఏర్పడింది. కృష్ణా, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో తీవ్రంగా నష్టపోయాయి.. ఈ తుఫాన్ కాకినాడ సమీపంలో తీరం దాటింది.

2021 సెప్టెంబర్ నెలలో గులాబ్ తుఫాన్ ఏర్పడింది. కళింగపట్నం వద్ద తీరం దాటింది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో ఈ తుఫాన్ వల్ల నష్టపోయాయి.2022 డిసెంబర్ నెలలో మాండౌస్ తుఫాన్ ఏర్పడింది. మహాబలిపురం వద్ద తీరం దాటింది. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాలో తీవ్రంగా ప్రభావితమయ్యాయి.2023 డిసెంబర్ నెలలో మిచౌంగ్ తుఫాన్ ఏర్పడింది. బాపట్లలో తీరం దాటింది.. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి.

# చిత్తూరు జిల్లాలో ఏనుగుల బీభత్సం

## రైతుపై దాడి చేసి తొక్కి చంపిన గుంపు

చిత్తూరు,అక్టోబర్15: పుంగనూరు నియోజకవర్గం పీలేరులో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. ఓ ఏనుగుల గుంపు రైతుపై దాడి చేసి దారుణంగా చంపేశాయి. కొన్ని రోజులుగా 15 ఏనుగులతో కూడిన గుంపు నియోజకవర్గంలో హల్‌చల్ చేస్తోంది. పంటపొలాలను నాశనం చేస్తూ రైతులకు కన్నీరు మిగుల్చు తున్నాయి. ఇదే క్రమంలో పుంగనూరు నుంచి పీలేరు వైపునకు వెళ్తూ ఓ మామిడి తోటలోకి ప్రవేశించాయి. వాటిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రైతు రాజారెడ్డిపై తీవ్రంగా దాడి చేశాయి. కాళ్లతో తొక్కి, మట్టిలో కుక్కేసి రైతును దారుణంగా చంపేశాయి. ఈ ఘటన పీలేరులో తీవ్ర కలకలం రేపుతోంది. అయితే కొన్ని రోజులుగా దేవళంపేట, అయ్యవాండ్లపల్లె, ఎర్రపాపిరెడ్డిపల్లె ప్రాంతాల్లో ఏనుగులు సంచారం పెరిగిపోయింది. తరచూ పంటపొలాలపై దాడులు చేస్తూ వాటిని నాశనం చేస్తున్నాయి. కడుపునిండా తినడం, మిగిలిన పంట తొక్కి నాశనం చేస్తూ రైతులకు క్షోభ మిగిల్చుతున్నాయి. అయితే రైతుపై దాడి ఘటనతో అటవీశాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే చిత్తూరు, మన్యం, విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో ఏనుగుల బెడద నుంచి రైతులు, పంటపొలాలను కాపాడేందుకు ఏపీ ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వయంగా వెళ్లి కర్ణాటక ప్రభుత్వంతో కీలక ఒప్పందం చేసుకుని వచ్చారు. ఆయా జిల్లాల్లో సమస్యను పరిష్కరించేందుకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సానుకూలంగా స్పందించారు. మావటీలకు శిక్షణ, కుంకీ ఏనుగులు ఏపీకి తరలింపు, ఏనుగుల శిబిరాల సంరక్షణ వంటి పలు కీలక అంశాలపై ఏపీ, కర్ణాటక మధ్య ఒప్పందం జరిగింది.

# సీఐడి చేతికి హై ప్రొఫైల్ కేసులు

గుంటూరు, అక్టోబరు 15, ఆంధ్రప్రదేశ్‌లో సీఐడీ మరో సారి యాక్టివ్ అవుతోంది. వైఎస్ఆర్‌సీపీ హయాంలో సీఐడీ సోషల్ మీడియా కేసుల నుంచి ప్రభుత్వ పెద్దలకు అత్యంత ముఖ్యమైన మార్గదర్శి వంటి కేసుల వరకు అన్నింటినీ డీల్ చేసేది. దాదాపుగా అన్ని రాజకీయ పరమైన కేసులే. ఇతర కేసుల విచారణ సాధారణ పోలీసులు తీసుకునే వారు. ఈ కారణంగా అప్పటి సీఐడీ చీఫ్‌లుగా పని చేసిన పీవీ సునీల్ కుమార్ తో పాటు సంజయ్ కు పోస్టింగ్‌లు లేవు. ఇద్దరిపై కేసులు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం మారిన తర్వాత కూడా అలంటి హై ప్రొఫైల్ కేసులు సీఐడీ వద్దకే వెళ్తున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ ఆఫీసుతో పాటు చంద్రబాబు ఇంటిపైనా దాడి జరిగింది. ఆ కేసులను అప్పట్లో పోలీసులు పట్టించుకోలేదు. కానీ ప్రభుత్వం మారిన తర్వాత దాడి జరిగింది తనపై కాబట్టి టీడీపీ నేతలు సీరియస్ గా తీసుకున్నారు. సీసీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆదారాలతో అరెస్టులు ప్రారంభించారు. చంద్రబాబు ఇంటిపైకి జోగి రమేష్ దాడికి వెళ్లిన కేసు కూడా వేగం పుంజుకుంది. తాజాగా హీరోయిన్ జత్వానీ కేసును కూడా సీఐడీకి అప్పగించారు.గత ప్రభుత్వ హయాంలో మద్యం , ఇసుకల పై భారీ స్కాం జరిగిందని ప్రస్తుత ప్రభుత్వం వెల్లడించింది. సీఐడీ ఈ మేరకు కేసులు పెట్టింది. మైనింగ్ వ్యవహారాలను తన చేతుల మీదుగా నడిపిన వీజీ వెంకటరెడ్డి అనే అధికారిని ?రెస్టు చేశారు. తదుపరి చర్యలు తీసుకోనున్నారు. లిక్కర్ స్కాంలో కీలకమని భావిస్తున్న మరో అధికారి వాసుదేవరెడ్డి పరారీలో ఉన్నారు. లిక్కర్ స్కామును ఇప్పటికే సీఐడీకి అప్పగిస్తున్నట్లుగా చంద్రబాబు ప్రకటించారు . ఇందులో పెద్ద ఎత్తున నగదు అక్రమ చెలామణి జరిగిందని అందుకే ఈడీకి కూడా సిపారసు చేస్తామని చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వం సీఐడీకి అప్పగిస్తున్న కేసులన్నీ రాజకీయ నేతలు, సివిల్ సర్వీస్ అధికారులకు సంబంధించినవే. వారే ప్రధాన నిందితులుగా ఉన్నారు. కనీసం పది మంది వరకూ సివిల్ సర్వీస్ అధికారులతో పాటు మాజీ సీఎం జగన్ దగ్గర నుంచి, పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి సహా పలువురు రాజకీయ నేతల పేర్లు వినిపిస్తున్నాయి. ఇవన్నీ సోషల్ మీడియా లాంటి చిన్నా చితకా కేసులు కావు. హై ప్రొఫైల్ కేసులు.. పవర్ ఫుల్ వ్యక్తులు నిందితులుగా ఉన్నారు. అందుకే సాధారణ పోలీస్ స్టేషన్లలో అయితే ఇతర కేసుల విచారణతో బిజీగా ఉండి పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేరని అందుకే సీఐడీని ఇన్వాల్వ్ చేస్తున్నారని అనుకోవచ్చు.

# 16 నుంచి మద్యం అమ్మకాలు

## రెండు నెలల లోపు ఉచిత ఇసుక అమలు

పెనమలూరు,ఏపీఎండిసీ కార్యాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు.మంత్రి మాట్లాడుతూ ఏ రాష్ట్రం లో లేని విధం గా గవర్నమెంట్ తీసుకు అన్ని మొత్తం బ్రష్టుపట్టించారు. చాలా పక్కడబందిగా చాలా ట్రాన్సపరెంట్ గా చేసాము. 89882 మంది అప్లై చెయ్యడం ఇది ఫస్ట్ టైం. ఒక్కో షాప్ కు సగటున 25 మంది వేశారు. ప్రభుత్వానికి 1798 కోట్లు ఆదాయం వచ్చింది .మోనోపోలి కి రాజకీయాలుకి ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. 16 నుండి సేల్స్ స్టార్ట్ చెయ్యడం జరుగుతుంది. అప్లై చేసిన వారు కూడా అందరు పద్ధతిగా వ్యవహారించారు. సహకరించిన అన్ని శాఖ ల అధికారులకు ధన్యవాదాలని అన్నారు. సబ్ కమిటీ ఇచ్చిన సలహాలు కూడా చాలా విలువైనవి. ఎమ్ ఆర్ పి కి మించి అమ్మడానికి లేదు. నిబంధనలకు విరుద్ధం గా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. మహిళలు వ్యాపార రంగం లో ముందుకు వెళ్ళాలి వాళ్ళు పాల్గొనడం సంతోషం. మార్నింగ్ 10 నుండి సాయంత్రం 10 వరకూ సేల్స్ జరుగుతాయి.ఎన్ఫోర్స్మెంట్ ను స్ట్రిక్ట్ చేసాము . కొత్త బ్రాండ్స్ కు టెండర్ కమిటీ ద్వారా ఫైనల్ చేసి తీసుకుంటాము. జగన్ మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వాళ్ళించ్చినట్టు వున్నాయి. గతం లో విచ్చలవిడిగా ఇసుక ని సొమ్ము చేసుకుంది జగన్ సర్కార్. ఎన్ జి టి నామ్స్ పాటించకుండా ఉండడం వల్ల అనేక కేసులు అయ్యాయి. అసలు జగన్ సర్కార్ లో ఎంత ఇసుక తీశారు విక్రయలు తదితర లెక్కలే అసలు లేవని అన్నారు. వైసీపీ చేసిన ఈ వ్యతిరేక పనుల వల్ల ప్రజలకు భారం పడింది. 108 రీచ్ లను గుర్తించాం. ఈ నెల 16 న 40 రీచ్ లను ఓపెన్ చెయ్యడానికి సిద్ధం గా వున్నాం. రాబోయే 2 నెలల లోపే ఫ్రీ సాండ్ అందుబాటులోకి వస్తుంది. అక్రమం గా తరలించే 40 వెహికల్స్ సీజ్ చేసాం. ప్రైవేట్ రెచ్చేస్ ని గుర్తించి త్వరలో వాటి పైన క్యాబినెట్ లో నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

# ఏపీ రోడ్లకోసం 400కోట్లు మంజూరు

## ఎక్స్ లో కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ

అమరావతి,ఆంధ్రప్రదేశ్లో 200.06 కిలోమీటర్ల పొడవైన 13 రాష్ట్ర రహదారుల అభివృద్ధికి కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి – సీఆర్ఎఫ్ నుంచి రూ.400 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. గుంటూరు– నల్లపాడు రైల్వే మార్గంలో రూ.98 కోట్లతో శంకర్ విలాస్ ఆర్వోబీని 4 వరుసలతో నిర్మించడానికి ఆమోదం తెలిపినట్లు అయన ప్రకటించారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు గడ్కరీని కలిసి చర్చించిన నేపథ్యంలో మంజూరు అయ్యాయి.

# పొంగిన వాగులు నిలిచిన రాకపోకలు

ఒంగోలుబంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బాపట్ల జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు ఉగ్రరూపం దాల్చాయి.బాపట్ల జిల్లా ఇంకొల్లు సమీపంలోని దుద్దుకూరు వద్ద రెండు రోజులు గా కురుస్తున్న వర్షాలకు యార వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది .దీనితో ఇంకొల్లు – ఒంగోలు కు రాకపోకలు నిలిచి పోయాయి.

పూసపాడు వద్ద ఉన్న కప్పల వాగు సైతం ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పర్చూరు – ఇంకొల్లు గ్రామాల మధ్య రాకపోకలకు కొంత మేర అంతరాయం ఏర్పడింది. వర్షాల కారణంగా పర్చూరు మండలంలో అధికారులు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. అల్పపీడన ప్రభావం వల్ల మరో రెండు రోజుల పాటు కొనసాగుతుందని..మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# గ్రామాల్లో పండుగ వాతావరణంలా పల్లె పండుగ వారోత్సవాలు.

ఎంపీడీవో..సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేస్తున్న టిడిపి నాయకులు, అధికారులు.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-ప్రతి గ్రామంలో పండుగ వాతావరణంలా పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఎంపీడీవో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతి గ్రామంలో పార్టీలకతీతంగా అభివృద్ధిని చేసి చూపించాలని నిర్ణయించుకున్న సంకల్పంలో భాగంగా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశానుసారంతో పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా మండల పరిధిలోని బి నాగిరెడ్డిపల్లె, మందలూరు, చందలూరు గ్రామాలలో సీసీ రోడ్లకు ఆయా గ్రామాలలోని ఎంపీటీసీలు, సర్పంచులు, టిడిపి నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ప్రతాప్, ఈసీ సుబ్బన్న, టిడిపి నాయకులు చంద్రయాదవ్, పేరూరు రామనాథ్ రెడ్డి, రామశేఖర్ రెడ్డి, శౌ రెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితర ప్రభుత్వ అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీవో ను మర్యాదపూర్వకంగా కలిసిన నంద్యాల జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి,

ఎంపీడీవో కు సిబ్బందికి శాలువా వేసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజారావు, మౌలాలి తదితరులు.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-రుద్రవరం మండల నూతన ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన భాగ్యలక్ష్మి ని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసిన నంద్యాల జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ రుద్రవరం మండల ఎంపీడీవో కార్యాలయంలో నూతన బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో, పిఆర్ ఏ ఈ కమల్ భాష, ఏవో సుబ్రహ్మణ్యం, జూనియర్ అసిస్టెంట్ హరికిషన్ లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువ వేసి పుష్పగుచ్ఛం, పూలమాలలతో ఘనంగా సన్మానించామన్నారు. అలాగే దళితులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను నిష్పక్షపాతంగా అమలు చేయాలని వారు కోరారు. దీంతో అధికారులు తమ సహాయ సహకారాలు నిష్పక్షపాతంగా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మౌలాలి, ఆకాష్, అశోక్ తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ

శ్రీ ప్రస్థానం న్యూస్ న్యూస్: అక్టోబర్ 15 సంజామల మండల పరిధిలోని గిద్దలూరు గ్రామంలో సబ్సిడీపై అందించే శనగ వితనములను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి సంజామల మండలాధ్యక్షుడు బత్తుల ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. సబ్సిడీపై రైతులకు అందించే శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్నిమంగళవారం గిద్దలూరులో ఆయనప్రారంభించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అర్హులైన రైతులకు చావిడిలో విత్తన శనగలను బత్తుల ప్రతాపరెడ్డి పంపిణీ చేశారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ రామ్మోహన్ టిడిపి నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు



# సీఐటీయూలో 30 మంది లారీ డ్రైవర్లు చేరిక...





ప్రస్థానం న్యూస్ కుక్కునూరు అక్టోబర్ 15 కుక్కునూరు మండలంలోని లారీ, ట్రక్కు, వ్యాన్ డ్రైవర్లు దాదాపు 30 మంది సిఐటియులో చేరారు. కుక్కునూరు లారీ యూనియన్ ఆఫీసులో మంగళవారం జరిగిన సమావేశంలో సిఐటియులో చేరేందుకు డ్రైవర్లు ఏకగ్రీవంగా తీర్మానించుకుని. సిఐటియు జిల్లా అధ్యక్షులు సమక్షంలో లారీ డ్రైవర్లు చేరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ లింగరాజు మాట్లాడుతూ... నిత్యం ప్రమాదాల అంచున జీవనం సాగిస్తున్న రవాణా రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డును(వెల్ఫేర్ బోర్డు) ఏర్పాటు చేయాలని కోరారు. గత ప్రభుత్వం పెంచిన త్రైమాసిక రహదారి పన్నులను తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రవాణా రంగం నుండి ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలకోట్ల రూపాయలు ఆదాయాన్ని ప్రభుత్వాలకు సమకూర్చుతున్నా, కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వాలు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైందని కనీసం గోతులను పూడ్చేందుకు కూటమి ప్రభుత్వానికి నాలుగు నెలలు సరిపోదా అని ప్రశ్నించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల లారీలకు ఇసుక రవాణా చేసేందుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఇసుక ర్యాంపుల నుండి రవాణా చేసేందుకు ఇతర ప్రాంతాల లారీలను వినియోగించడం వలన మండలంలోని డ్రైవర్లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిఐటియు మండల అధ్యక్షులు,కార్యదర్శి కుంజ నాగలక్ష్మి, యర్నం సాయికిరణ్, సిఐటియు జిల్లా కార్యదర్శి మడవి దుర్గారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, లారీ యూనియన్ నాయకులు నిర్మల వెంకటేశ్వర్లు,కట్టబోయిన మల్లేష్,అంగిరేకుల వెంకటేశ్వరావు, సీఐటీయూ నాయకులు పోచరపు వెంకటేశ్వర్లు, కాకర్ల శ్రీను,బాడీస సుజాత,తిరోజుల సురేష్, పోచారపు వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల అభివృద్ధికే పల్లె పండుగ కార్యక్రమం..





ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, భూమా అఖిల ప్రియ..దొర్ని పాడు, అక్టోబర్:15, శ్రీ ప్రస్థానం న్యూస్:- ప్రతి పల్లెకు డ్రైనేజీ, సిసి రోడ్లు, తాగు నీటి సౌకర్యం కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమాలు చేపట్టిందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, భూమా అఖిల ప్రియ,అన్నారు..అంతకముందు ఎమ్మేల్యే కు మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పూల వర్షం కురిపిస్తూ టపాసులు పేల్చుతూ మేల తాళాలతో సాదరంగా గ్రామానికే ఆహ్వానించారు. మంగళ వారం మండల కేంద్రమైన దొర్నిపాడు, డబ్ల్యు.గోవిందిన్నే, గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ - పంచాయతీ వారోత్సావాలు కార్యక్రమంలో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మేల్యే భూమా అఖిల ప్రియ, చేతుల మీదుగా భూమి పూజ చేపట్టి పనులు ప్రారంభించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గోపవరం అమర్నాథ్ రెడ్డి,ఎంపీడీఓ. కె. సావిత్రి అధ్యక్ష జరిగిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి ఎమ్మేల్యే భూమా అఖిల ప్రియ, ముఖ్య అతిథిగా పాల్గొనీ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులను గూర్చి అధికారులను అడిగి తెలుసుకు న్నారు..అనంతరం స్థానిక సొసైటీలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కూడ పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకునీ వారి నుంచి అర్జీల రూపంలో వచ్చిన వినుతులను ఎమ్మేల్యే స్వీకరించారు.. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు శకుంతల రెడ్డి, మండల టిడిపి నాయకులు భూమా సంతోష్ రెడ్డి, సందీప్ రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్లు, సిద్ది సత్యనారాయణ, బబ్బురి వెంకట స్వామి, గ్రామ టిడిపి నాయకులు జీ. కృష్ణా రెడ్డి, లింగుట్ల వెంకట నాయుడు, బబ్బురి క్రిష్ణ, జీ.కాశీ విశ్వనాథ్ రెడ్డి గోపాల్ నాయుడు, నారాయణ స్వామి, బి. వెంకట రామి రెడ్డి, దయందరావు, వర ప్రసాద్, కె.మహ బూబ్ బాషా, అంజి బాబు,గ్రామ సర్పంచ్ లు పి.మదవి లత, బి.ఉమా దేవి,బి. పద్మిని,ఎల్. చంద్ర శేఖర్ రెడ్డి, శివ రామి రెడ్డి, భూమా ప్రభాకర్ రెడ్డి, మిద్దె బాలయ్య, జీ. బాల సుబ్బయ్య, వైస్ సర్పంచ్ హరి బాబు,ఎంపిటిసి సభ్యులు రామ్ ప్రసాద్ రెడ్డి, కట్టు బడి మహబూబ్ బాషా, ఆర్ డబ్ల్యు ఎస్.ఏ ఈ.కె.సుప్రియ,ఏ.ఓ.వెంకట రామి రెడ్డి, పీహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ రుహుల్ల ఖాన్, వెటర్నరీ విద్యాధికారి డాక్టర్ పుల్లయ్య, సొసైటీ టీ సీ ఈ ఓ.హర్ష,విద్యుత్ శాఖ ఏ.ఈ.కె.రామ్మోహన్, ఎం ఈ ఓ.లు మనోహర్ రెడ్డి, రామ చంద్రయ్య, ఐసిడిఎస్ మండల సూపర్ వైజర్ ప్రభకరమ్మ, ఉపాధి హామీ పథకం ఏ పీ ఓ.గంగన్న, మండల రిసోర్స్ పర్సన్ జర్మియ,మండల రెవిన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది,టిడిపి కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

# పదవ తరగతిలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులు కావాలి

ఉత్తమ ఉపాధ్యాయుల తో పదవ తరగతి విద్యార్థులకు వర్చువల్ బోధనకు తగిన ఏర్పాట్లను చేయండి జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా




కర్నూలు, అక్టోబర్ 15: జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.మంగళవారం నగరంలోని దామోదరం సంజీవయ్య స్మారక మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించి, విద్యార్థులతో సంభాషించారు.. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై బోధన, పిల్లల సామర్థ్యం, ఉత్తీర్ణత తదితర అంశాల గురించి కలెక్టర్ చర్చించారు. జిల్లా కలెక్టర్ ముందుగా పాఠశాల ఆవరణంలోని బాల బాలికలతో సంభాషిస్తూ, భోజనం చేశారా ? మెనూ ప్రకారం మీకు భోజనం అందజేస్తున్నారా, నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని ప్రశ్నించారు..మెనూ ప్రకారం భోజనం అందజేస్తున్నారని పిల్లలు సమాధానమిచ్చారు.. పాఠశాలలో లైబ్రరీ ఉందా అని కలెక్టర్ ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు.. పాఠశాలకు వచ్చే పిల్లల హాజరు ఏ విధంగా తీసుకుంటున్నారు, ఒకవేళ వారు పాఠశాలకు హాజరు కాకపోతే ఎందుకు రాలేదు అనే కారణాలను అడిగి తెలుసుకుంటున్నారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. ఈ సంవత్సరం నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఏ సబ్జెక్టు లో ఎంత మంది పాస్ అయ్యారని టీచర్స్ ను అడిగి తెలుసుకున్నారు..ప్రస్తుతం పదవ తరగతి చదివే విద్యార్థులతో పాటు ఫెయిల్ అయిన వారు కూడా పాస్ అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు..జిల్లాలో పదవ తరగతి విద్యార్థులకు ఉత్తమ ఉపాధ్యాయుల తో పాఠ్యాంశాలు బోధించేందుకు వర్చువల్ పద్ధతిలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డిఈఓను ఆదేశించారు. వర్చువల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు, బాగా బోధించే ఉపాధ్యాయులను ఎంపిక చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి విద్యార్థి పదవ తరగతి పరీక్షల్లో కచ్చితంగా పాస్ అయ్యేలా బోధన ఉండాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా షెడ్యూల్ రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ సూచించారు..ప్రాథమిక పాఠశాల స్థాయి నుండే విద్యార్థులు చదవడం,రాయడం వంటి కనీస నైపుణ్యాలు సాధించే విధంగా బోధనా పద్ధతులు ఉండాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు.సమావేశంలో ఉపాధ్యాయులు, మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, డిఈఓ శామ్యూల్, కర్నూల్ అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పుట్టపర్తి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా ఉద్యోగ అవకాశాలు.

పుట్టపర్తి రూరల్:పుట్టపర్తి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్ కళాశాల యందు, టైటాన్ ఐ ప్లస్ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించగా 15 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించినట్లు పుట్టపర్తి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ నిర్వాహకుడు బొగ్గు సురేష్ తెలిపారు. ఈ సంస్థ నుండి 15 మంది విద్యార్థులకు మంగళవారం కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన అభ్యర్థుల ఎంపికలో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. వీరికి నూరు శాతం జాబ్ ప్లేస్మెంట్ కల్పించినట్టు ఆయన తెలిపారు. మొట్టమొదటిసారిగా పుట్టపర్తి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఎంపిక కావడం ఎంతో హర్షించదగ్గ విషయమని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 2024- 25, సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు కొరకు ఇంకా సమయం ఉందని ఆసక్తి కలిగిన వారు పుట్టపర్తి ఇనిస్టూట్ ఆఫ్ మెడికల్ పండు సైన్సెస్ లో సంప్రదించాలని కోరారు.

# విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు..

కోవెల కుంట్ల, విద్యుత్ శాఖ ఏ. ఈ. కె. రామ్మోహన్..



దొర్నిపాడు, అక్టోబర్:15, శ్రీ ప్రస్థానం న్యూస్ :- విద్యుత్ శాఖ లో పని చేస్తున్న విద్యుత్ సిబ్బంది విధులు పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కోవెల కుంట్ల విద్యుత్ శాఖ ఏ.ఈ. కె.రామ్మోహన్,అన్నారు ..మండల కేంద్రమైన దొర్నిపాడు విద్యుత్ సబ్ స్టేషన్ లో మంగళ వారం విద్యుత్ శాఖ ఏ.ఈ.ఆకస్మి కంగా తనిఖీలు చేపట్టారు. అనంతరం లాగ్ రిజిస్టర్ లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.అలాగే విద్యుత్ సిబ్బంది యొక్క పని తీరును అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా కోతలు లేని నాణ్యమైన విద్యుత్,ను గృహ వినియోగ దారులకు అందించేలా చూడాలనీ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ దేవర కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి





శ్రీ ప్రస్థానం-గడివేముల :- అక్టోబర్ 16:- మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో గ్రామ దేవరా కార్యక్రమాన్ని మంగళవారం కాటసాని రాంభూపాల్ రెడ్డి నిర్వహించారు. అనంతరం ఆయన నాయకులతో కార్యకర్తలతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఆర్.బి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ , వైస్ ఎంపీపీ కాలు నాయక్, సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి, మహేష్ రెడ్డి, పుల్లయ్య, భూపాల్ రెడ్డి, రమేష్, మేఘనాథ్ రెడ్డి , ప్రతాప్ రెడ్డి, శేఖర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అన్ని విధాలా ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలి

నగరంలో హంద్రీ, తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు, అక్టోబరు, 15 : భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అన్ని విధాలా ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.మంగళవారం నగరంలోని జొహరాపురం బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తున్న హంద్రీ నదిని, అనంతరం పాతబస్తీలోని రాఘవేంద్ర స్వామి మఠం వెనుక ఉన్న తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముందుగా జొహరాపురం బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తున్న హంద్రీ నదీ ప్రవాహాన్ని పరిశీలించారు..ఒకవేళ భారీ వర్షాలు వస్తే ఎన్ని క్యూసెక్కుల మేర నీరు వచ్చే అవకాశం ఉంటుంది, ఏఏ ప్రాంతాలు ప్రభావితం అవుతాయి అన్న వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. 5 లక్షల క్యూసెక్కుల నీరు వస్తే కొన్ని ప్రాంతాలు ముంపుకు గురయ్యే అవకాశం ఉందని, ప్రస్తుతం 60 వేల క్యూసెక్కులు మాత్రమే ఉందని అధికారులు తెలిపారు..మ్యాపు ద్వారా ముంపుకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు..ప్రస్తుతం జిల్లాలో అల్పపీడనం ప్రభావం అంతగా లేదని, అయినప్పటికీ అధికారులు అప్రమత్తంగా ఉండి, పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ఇరిగేషన్, మున్సిపల్ కమిషనర్, కర్నూలు ఆర్డీఓ లను ఆదేశించారు. హంద్రీ నదీ చుట్టూ ఉన్న జంగిల్ క్లియరెన్స్ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.. ఈ అంశంపై చర్చించేందుకు ఇరిగేషన్,మున్సిపల్ కమిషనర్, కర్నూలు ఆర్డీఓలతో సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం పాతబస్తీలోని రాఘవేంద్ర స్వామి మఠం వెనుక ఉన్న తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.జిల్లా కలెక్టర్ వెంట కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757